వాసవి క్లబ్ డాన్ టు డస్క్ ప్రోగ్రాం విజయవంతం

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: ఎస్ కోట మండల కేంద్రంలో వాసవి క్లబ్ మెగా మరియు వాసవి క్లబ్ యూత్ వాసవి క్లబ్ వనిత విభాగం ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసింది ఈ కార్యక్రమంలో భాగంగా సమాజంలోని వివిధ వర్గాల వారికి సహాయం చేయడమే ముఖ్యంగా తలపెట్టిన ఈ కార్యక్రమంలో సైనికులకు రైతులకు చెప్పులు కుట్టు వారికి సన్మాన సత్కార కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ రవి కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ విశ్వేశ్వరరావు, ప్రాంతీయ అధికారి నానాజీ అధ్యక్షులు పి.అప్పారావు, యు.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు

గిరిజన రైతులపై జిందాల్ దందా

- పండించే పంట భూములను తీసుకుని నేడు మొండి చేయి
- కంపెనీ ఏర్పాటు చేయకుండా తాత్సారం
- కంపెనీ ఏర్పాటు చేయకపోతే భూములు వెనక్కి ఇవ్వాలని రైతుల డిమాండ్

విశాలాంధ్ర - విజయనగరం: ఎస్.కోట ప్రాంతంలో భారీ పరిశ్రమ వస్తే ఈ ప్రాంతమంతా ఎంతో అభివృద్ధి చెందుతుందని ఈ ప్రాంతవాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దాదాపు 18 ఏళ్ళక్రితం జిందాల్ కంపెనీకి చర్చలు జరగగా బొడ్డ వర ప్రాంతంలోని పలు గ్రామాలలో భూములు అవసరమని గుర్తించారు. పంటలు పండే భూములను ఇచ్చేందుకు రైతులు అంగీకరించలేదు. అయితే ఈ సమయంలో ప్రభుత్వ పెద్దలు, స్థానిక పెద్దలు అందరూ కలిసి వారి పిల్లల భవిష్యత్‌లు బాగుంటాయని, ఉద్యోగాలు ఇస్తారని ఇలా అనేక ఆశలు చూపించారు. దీంతో ఇష్టం లేకపోయినా కన్నతల్లిలాంటి భూమిని కార్పోరేట్‌కు దారాదత్తం చేసారు. అంతే అప్పటినుంచి గిరిజన రైతుల కష్టాలు మొదలయ్యాయి.

ఆ నాలుగు గ్రామాల్లో నేటికీ తేరుకోని రైతులు..

ఎస్.కోట మండలంలోని కిల్లంపాలెం, ముషిడిపల్లి, చీడిపాలెం, చినఖండేపల్లి గ్రామాలకు చెందిన రైతులు నేటికీ తేరుకోలేని పరిస్థితిలో ఉన్నారు. 4 వేల కోట్లతో ఏర్పాటు చేస్తున్న జిందాల్ అల్యూమినయం కంపెనీతో తమ బతుకులు పూర్తిగా మారిపోతాయని భావించారు. వారి ఆశలు అడియాశలు అయ్యాయి. ఏళ్ళ తరబడి కంపెనీ యాజమాన్యం ఇదిగో అదిగో అని కాలయాపన చేసింది. కొన్నాళ్ళు ఉద్యోగాల పేరుతో కొందరిని ఎంపిక చేసి శిక్షణ కూడా ఇచ్చింది. కొన్నాళ్ళు వేతనాలను చెల్లించారు. ఇలా అనేక రకాలుగా మోసాలు చేసి రైతులను మాయలో ముంచారు. జిందాల్ మోసం తెలుసుకున్న రైతులు ఇప్పుడు తమ భూములు తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

తూతూ మంత్రంగా నాడు చెల్లింపులు

భూసేకరణ సమయంలో అనేక అవకతవకలు జరిగాయనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. అదే సమయంలో రైతులుకు కేవలం ప్రభుత్వ ధరలను చెల్లించి నాడు ఒప్పందాలను చేసుకున్నారు. కానీ 18 ఏళ్ళగా కంపెనీ ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డున పడ్డ గిరిజన రైతులు, కంపెనీ పెట్టలేదు కనుక తమ భూములు తిరిగి ఇవ్వాలని, వ్యవసాయం చేసుకుని బతుకుతాం అని కోరుతున్నారు. కానీ రైతులకు ఎటువంటి మద్దతు రాజకీయ వర్గాలనుంచి అందడంలేదు. దీంతో నియోజకవర్గంలోని అన్ని పార్టీల పెద్దలను, స్థానిక ఎమ్మెల్యేలను రైతులు నేరుగా కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



ఏమిటీ జిందాల్ దందా..!

నాడు కంపెనీ అని చెప్పి రైతుల నుంచి తీసుకున్న భూములలో ఎటువంటి నిర్మాణాలు చేయకుండా అటు ప్రభుత్వాలతో మంతనాలు చేస్తూ కాలయాపన చేస్తున్న జిందాల్ యాజమాన్యం. ఇప్పుడు భూములను రైతులు తిరిగి ఇవ్వాలని కోరడంతో ఈభూములలో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. భూములను వదులుకోడానిక ఇష్టం లేక ఆడుగున్న డ్రామా అని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు ఇప్పుడు తమకు అండగా నిలిచే నేతల వద్దకు వెళ్ళి సహకరించాలని కోరుతున్నారు. త్వరలోనే దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలి

ఎం.ఎల్.ఏ కోళ్ళ లలిత కుమారి

విశాలాంధ్ర-జామి : ప్రపంచ మేదావి,రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలని శృంగవరపుకోట ఎం.ఎల్.ఏ. కోళ్ళ లలితకుమారి పిలుపునిచ్చారు. మండలంలోని పావాడ గ్రామంలో ఆదివారం ఆమె చేతుల మీదుగా అంబేద్కర్ విగ్రహవిష్కరణ జరిగింది. అనంతరం దళిత నేత పత్రిఅప్పారావు అధ్యక్షత జరిగిన సభలో ఎం.ఎల్.ఏ మాట్లాడుతూ తాడిత పీడిత బడుగువర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని మహనీయుని ఆశయ సిద్ధికోసం మనమంతా పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో డి.సి.ఎం.ఎస్. చైర్మన్ గొంపకృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలే దేశానికి రక్షణ అని కొనియాడారు. దళితనాయకుడు ఉదయ భాస్కర్ మాట్లాడుతూ నియోజవర్గ కేంద్రమైన ఎస్.కోటలో అంబేద్కర్ విజ్ఞాన మందిరం నిర్మించాలని ఎం.ఎల్.ఏకు విన్నవించగా,అంబేద్కర్ విగ్రహ నిర్మాణంకు కృషి చేస్తానని సభాముఖంగా హామీయిచ్చారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జాగరపు జ్యోతి, రెడ్డి పైడిబాబు,గంటాన అప్పారావు, డా.కంర వేణు, బోని కృష్ణ,కె.జేసుదాసు ,జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. బహుజన కళా మండలి,గౌరి పరమేశ్వరి మహిళా కోలాట బృందం ఆట -పాట పాటలు అలరించాయి. అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: దేశంలో మోదీ ప్రభుత్వం తక్షణమే అసంఘటిత రంగ కార్మికుల కోసం సమగ్ర చట్టం చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ, ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం దాబా తోట కళాసి కార్మికులుతో నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న జాతీయ సమ్మె జరుగుతోందని జిల్లాలో కార్మికులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కనీస వేతనాల చట్టం సవరణ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు, అధిక ధరలు తగ్గించాలని, సంవత్సరానికి 2 కోట్లు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవింద, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన 100 గంటల సంకీర్తన

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణ పరిధిలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 100 గంటల అఖండ నామ సంకీర్తన ఆదివారం ఘనంగా ముగిసింది. సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి సత్యసాయి సేవా సమితి సభ్యులు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అఖండనామ సంకీర్తనను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సునీల్ కుమార్ పట్నాయక్ జిల్లా ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ వి.రామ్మోహన్రావు, కమిటీ సభ్యులు శ్రీధర్ మూర్తి, రజిని, స్థానిక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జామిలో రామాయలంలో హుండీ చోరీ

విశాలాంధ్ర -జామి: మండల కేంద్రమైన జామిలోని కొత్తలిఆవారి కోవెల సమీపంలో ఉన్న చుక్కవారి రామాలయంలో ఆదివారం మద్యాహ్నం పట్టపగలు హుండీ చోరీకి గురయింది. స్థానికులు కథనం మేరకు ఉదయం ఆలయ అర్చకులు వెలివెల సాయి పూజా కార్యక్రమాలను ముగించుకుని ఆలయానికి తాళాలు వేసి వెళ్ళిపోయారు. మద్యాహ్నం సమయంలో పెద్దగా జనసంచారం లేకపోవడంతో దొంగలు ఈవిషయాన్ని గమనించి ఆలయం తలుపులను తొలగించి హుండీ తాళాలను పగులగొట్టారు. హుండీలో ఉన్న మొత్తం నగదును దోచుకుపోయారు. హుండీలో దాదాపు రూ.15వేలు వరకు ఉంటుందని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. అయితే ఈఆలయంలో హుండీ చోరీకి గురవడం ఇది రెండవసారి కావడం విశేషం.

అండర్ బ్రిడ్జి సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర - కొత్తవలస: మండలంలో గల మంగలపాలెం గ్రామానికి చేరుకునే మార్గంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి సమస్య గ్రామ ప్రజలకు శాపంగా మారి వేధిస్తోందని ఈ నేపథ్యంలో అండర్ బ్రిడ్జి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పెద్దలు, ప్రజలు, యువకులు ఆదివారం బ్రిడ్జి వద్ద పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రైల్వే గేటు ఉన్నప్పుడే

బాగుండేదని.. కానీ ఈ రైల్వే అండర్ బ్రిడ్జి వచ్చిన తర్వాత నానా అవస్థలు పడుతున్నామని, ముఖ్యంగా రైల్వే అండర్ బ్రిడ్జి వలన ఆడవాళ్ళకి, వృద్ధులకు వాహనాలు లేని వాళ్ళకి రోడ్డు మీదకు రావాలంటే కత్తి మీద సాములా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారిలో లైట్లు కూడా లేవని, రోడ్లు మొత్తం డ్రైనేజీతో నిండిపోవడం వల్ల ప్రయాణాలు సాగిస్తున్న గ్రామస్తులు, వృద్ధులు, మహిళలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బ్రిడ్జి ఎత్తు తక్కువగా ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో సైతం అంబులెన్స్ గ్రామంలోకి రాలేని పరిస్థితి ఉందన్నారు. లైట్లు వేసి, బ్రిడ్జి వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, యువత, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారాలు

విశాలాంధ్ర - రాజాం: ది సన్ స్కూల్లో ఆదివారం స్నేహం అసోసియేషన్ తరపున రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల విద్యార్థులు ఐఐటి, నీట్, వివిధ విద్యారంగంలో ప్రతిభ చూపించిన విద్యార్థులకు సత్కారాలు చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా స్నేహం అసోసియేషన్ కన్వీనర్ అంబికా కోటేశ్వరరావు, కో కన్వీనర్ కొత్త సాయి ప్రశాంత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ సత్కారాలు మిగిలిన విద్యార్థులకు ప్రేరణ కలిగించాలని కోరారు. కొత్త సాయి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని మిగిలిన విద్యార్థులకు ఈ సత్కారాలు ప్రేరణగా ఉండాలని విద్యారంగంలో మన రాజాం వారు ముందు స్థానంలో ఉండాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో స్నేహం సభ్యులు బీవీ అచ్యుత కుమార్, కొల్లా పార్థసారథి, కొత్త ప్రకాష్ రావు,కొత్త శ్రీను, ఉప్పల ప్రసాద్, గట్టి పాపారావు, నీలకంఠేశ్వర యాదవ్, పింకీ చైతన్య, తిరుమలేశ్వరరావు, సీమకుర్తి రంగా, సీమకుర్తి నరసయ్య, కొత్త రమేష్, పొట్ట నాని, పొట్ట కళ్యాణ్ చక్రవర్తి, కొల్లూరి రవి పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి 'విశాలాంధ్ర'

- ఎన్ని ఆటుపోట్లు వచ్చినా ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామేశ్వరరావు వెల్లడి
- ఘనంగా విశాలాంధ్ర 73వ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - విజయనగరం: రెండు తెలుగు రాష్ట్రాల్లో అణగారిన వర్గాల ప్రజలకోసం, కార్మిక, కర్షక, అసంఘటిత రంగాల వర్గాల కోసం అనునిత్యం కృషి చేసేదే విశాలాంధ్ర దిన పత్రిక అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, విశాలాంధ్ర విజ్ఞాన సమితి సభ్యులు పి. కామేశ్వరరావు అన్నారు. విశాలాంధ్ర దిన పత్రిక 73వ వార్షికోత్సవ వేడుకలను విజయనగరంలోని జిల్లా కార్యలయంలో స్టాఫ్‌రిపోర్టర్ నార్లమహంతి సన్యాసిరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా వార్షికోత్సవానికి సంబంధించిన కేక్‌ను కామేశ్వరరావు కట్ చేసి విశాలాంధ్ర కుటుంబ సభ్యులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్ని ఆటుపోట్లు వచ్చినా విశాలాంధ్ర పత్రికను నడవడం జరుగుతుందని అన్నారు. లాభాలను ఆశించి పెట్టిన పత్రిక కాదని, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళేందుకు పత్రికను వినియోగించుకోవాలన్నారు. విశాలాంధ్ర పత్రికకు ముందుకు అనేక పత్రికలు వచ్చి కొద్ది కాలంలోనే కాలగర్భంలో కలిసిపోయాయని గుర్తు చేశారు. పత్రికను అందరం కలిసి మరింతగా బలోపేతం చేసుకోవాలన్నారు. మరో ముఖ్యఅతిథి మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రొంగలి పోతన్న మాట్లాడుతూ విశాలాంధ్ర అంటే ఒక నమ్మకం కలిగిన పత్రిక అని, నిజాలను, సమస్యలను నిరంతరం ప్రపంచానికి తెలియజేయడంలో దీనికిదే సాటి అని కొనియాడారు. రానున్న కాలంలో మరింతగా పత్రిక అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నానన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ విశాలాంధ్ర పత్రిక అంటే సిపిఐ పార్టీ కరదీపిక వంటిదన్నారు. పత్రికకు సిపిఐ నుంచి అన్ని విదాలా అండదండలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన విశాలాంధ్రను విలేకరులు కాపాడుకోవాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఅండ్ పిఆర్ పిఆర్‌వో మజ్జి వాసు, విశాలాంధ్ర టౌన్ ఇన్‌చార్జి ఎం.ప్రతాప్‌కుమార్, జిల్లాలోని విలేకరులు, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ షేక్ ఇబ్రహీం, శ్రీలక్ష్మీదుర్గ హెూటల్ యజమాని మణివర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్మారక పురస్కారం అవార్డు గ్రహీత దంపతులకు ఘన సన్మానం

విశాలాంధ్ర - బొబ్బిలి: సామాజిక సేవలో ముందంజలో ఉండి ఉన్నతంగా ఎదగాలని సెయింట్ ఆంద్రూస్ లూదరన్ చర్చ్ బోధకులు రెవరెండ్ జాన్ విక్టర్ అన్నారు. ఆదివారం స్థానిక మహారాణి పేటలో గల లూదరన్ చర్చ్‌లో చర్చ్ ప్రతినిధులు, సంఘ సభ్యులు ఎన్‌టిఅర్ స్మారక పురస్కారం అందుకున్న రోటరీ క్లబ్ అధ్యక్షులు, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ స్మారక పురస్కార్ అవార్డు గ్రహీత, రోటరీ క్లబ్ అధ్యక్షులు కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు దంపతులను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. చర్చ్ ప్రతినిధులు పి.రాజు, రమణ మాస్టార్లు మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా, ఏపీటీఎఫ్ సంఘ నాయకునిగా, కారుణ్య, రోటరీ సంస్థల చైర్మన్‌గా లుదరన్ చర్చ్ నాయకునిగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారన్నారు. కార్యక్రమంలో ఆల్టర్ నేటివ్ డెలిగేట్ పివిపి మెర్సీ బాయ్, వజ్ర కుమారి, రాజేశ్వరి, శేఖర్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభల కరపత్రాలు ఆవిష్కరణ

విశాలాంధ్ర - బొబ్బిలి: జులై 26, 27 తేదీలలో బొబ్బిలిలో జరుగు సీపీఐ 14వ జిల్లా మహాసభల కరపత్రాలను సిహెచ్ బొడ్డ వలస గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ శాఖ మహాసభ నిర్వహించారు. శాఖ కార్యదర్శిగా కాగాన గణేష్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై పాలక పక్షాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు నిర్వహిస్తూ నిరంతరం రైతులు, బడుగు, బలహీన వర్గాలు, కార్మికులు పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఎన్నో పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. బొబ్బిలి నియోజకవర్గంలో వందలాది ఎకరాల భూములను భూ పోరాటాలు నిర్వహించి ఇంట్లో భూమి లేని నిరుపేదలకు భూములు పంచిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. మహాసభల విజయవంతానికి విద్యావంతులు, మేధావులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న. సీపీఐ శాఖ కార్యదర్శి కాగాన గణేష్. సీపీఐ శాఖ సభ్యులు కాగానా సంజీవ్, గణేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల జిల్లా గ్రంథాలయ కమిటీ కన్వీనర్‌గా రామభద్రరాజు

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: కళాశాలల జిల్లా గ్రంథాలయ కమిటీ కన్వీనర్‌గా బుద్ధరాజు రామభద్రరాజును నియమిస్తూ ఆదివారం జిల్లా గ్రంథాలయ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు నాలుగెస్సులరాజు, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షులు కె. దయానంద్‌లు సంఘ కార్యాలయంలో ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 34 ఏళ్ళ పాటు గ్రంథాలయ అధికారిగా, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా పనిచేసిన రామభద్రరాజు జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసారని అన్నారు. వీరి ఆధ్వర్యంలో కళాశాలల్లో గ్రంథాలయాలను బలోపేతం చేస్తూ విద్యార్థుల్లో పుస్తకపఠనం పెంపొందిస్తూ, గ్రంథాలయాల కార్యక్రమాలను ప్రోత్సాహించడం జరుగుతుందని, అలాగే ముఖ్యమైన జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా రామభద్రరాజుకు గ్రంథాలయ సంఘం సభ్యులు పలువురు అభినందనలు తెలియజేసారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఆరుగురు క్రీడాకారులు ఎంపిక

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: ఈనెల 23 నుండి 25 వరకు ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో జరగబోయే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుండి ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరు ఈనెల 10,11 తేదీ అనంతపూర్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలలో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికై మన రాష్ట్ర తరపున పాల్గొంటున్నారు. హర్షిని, తరుణ్, రోహిణి సత్య, బి.హర్షవర్ధన్, వైష్ణవి దేవి, షణ్ముఖ సిద్దార్థ్, వీరిని జిల్లా తైక్వాండో అధ్యక్షులు గురాన అయ్యలు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్.వేణు గోపాలరావు, కోచ్ యశస్విని విజయంతో తిరిగి రావాలని కోరుతున్నారు.

మా జీవితాలను బుగ్గి పాలు చేయొద్దు

- క్వారీ పేలుడు పదార్థాల గిడ్డంగి అనుమతులు రద్దు చేయాలి
- గిడ్డంగి యజమానికి కొమ్ముకాస్తున్న అధికారులు
- స్వచ్ఛమైన దర్యాప్తు చేపట్టాలంటున్న గ్రామస్తులు
- లేకుంటే కోర్టును ఆశ్రయిస్తామన్న ఫిర్యాదుదారులు

విశాలాంధ్ర - వేపాడ: రాతి క్వారీల బ్లాస్టింగ్ పేలుడు పదార్థాల నిల్వ గిడ్డంగికి జనావాసాల మధ్య గ్రామానికి అతి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చి మా గ్రామస్తులు, పశువుల కల్లాల రైతులు, చుట్టుపక్కల వ్యవసాయ రైతుల జీవితాలను బుగ్గు పాలు చేయొద్దంటూ చామలాదేవి అగ్రహారం గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మండల ంలోని చామలాదేవి అగ్రహారం రెవిన్యూలో సర్వే నంబర్ 4లో నిర్మించిన బ్లాస్టింగ్ పేలుడు పదార్థాల గిడ్డంగికి అనుమతులు రద్దు చేయాలని కలెక్టర్ గ్రీవెన్స్‌లో గ్రామస్తులు, రైతులు, ఫిర్యాదులు చేయగా అధికారులు ఫిర్యాదుదారులకు తెలియకుండా పరిశీలించినట్లు ప్రస్తుతం అధికార పార్టీ నాయకులకు తలొగ్గి గిడ్డంగి యజమానికి అనుకూలంగా నివేదికలు ఇచ్చినట్లు తెలుస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన వెంటనే జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పందించి తహశీల్దార్ జె.రాములమ్మకు గిడ్డంగి సీజ్ చేసి చర్యలు తీసుకోమని ఆదేశించారు. అలాగే జిల్లా ఆర్డీఓ దాట్ల కీర్తి గిడ్డంగి పరిశీలనకు వచ్చి పరిశీలిస్తుండగా ఆర్డీఓ వచ్చిన విషయం తెలుసుకొని గ్రామస్తులు గిడ్డంగి దగ్గర చేరుకొని ఆమె దృష్టికి తీసుకెళ్లగా గిడ్డంగి నుండి గ్రామానికి గల దూరం ఎంత అన్నది గూగుల్ సర్వే చేయించి నివేదిక ఇవ్వాలని రెవిన్యూ అధికారులకి

ఆదేశించి వెళ్లిపోయారు. అలాగే శృంగవరపుకోట రూరల్ సీఐ పి.అప్పలనాయుడు ఫిర్యాదుదారులకు తెలియకుండా పరిశీలించినట్లు తదుపరి నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. కనీసం అధికారులు ఫిర్యాదు దారులకు తెలియకుండా పరిశీలనకు రావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మండలంలో ఇదివరకే ఒక గిడ్డంగికి అనుమతులు ఇచ్చి ఉన్నారని, అలాగే ఇదే గిడ్డంగి సమీపంలో వావిలపాడు రెవిన్యూలో పేలుడు పదార్థాలు గిడ్డంగి నిర్మిస్తే దానికి అనుమతులు రద్దు చేసిన విషయం అధికారులు తెలుసుకోవాలని, అది చాలదన్నట్లు ఇంకా మా గ్రామానికి సమీపంలో ఈ గిడ్డంగి నిర్మిస్తే దీనికి ఎలా అనుమతులు ఇస్తారని చామలాదేవి అగ్రహారం గ్రామస్తులు, వావిలపాడు వ్యవసాయ రైతులు మండిపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామానికి 500 మీటర్ల దూరం కూడా లేని విధంగా గిడ్డంగి నిర్మిస్తే ఎటువంటి పరిశీలన లేకుండా అనుమతులు ఇచ్చి అధికారులు గిడ్డంగి యజమానితో కుమ్మక్కై అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పి పేలుడు పదార్థాలకు ఎలా అనుమతిస్తారని, ఈ విషయమై జిల్లా అధికారులు స్వచ్ఛమైన దర్యాప్తు చేపట్టి గిడ్డంగి అనుమతులను రద్దు చేయకపోతే ధర్నా చేపట్టడంతో పాటు కోర్టును ఆశ్రయిస్తామని అంటున్నారు.

యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చెయ్యండి

విశాలాంధ్ర, దత్తిరాజేరు: నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు మహదేవ్ ఫణీంద్ర నివాసం వద్ద ఆదివారం యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించిన మండల యువజన విభాగం అధ్యక్షులుదత్తిచిరంజీవి.జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కూడలి వద్ద నేడు జరగబోయే యువతపోరు కార్యక్రమానికి నాయ కులు, యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, అలాగే నిరుద్యోగ భృతి 3000, ఫీజు రియంబర్స్మెంట్ హామీలు అటుకెక్కాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు మహదేవ్ ఫనీంద్ర, యువజన విభాగం కోశాధికారి ఈదుబిల్లి మురళీధరరావు,కార్యదర్శి మహాదేవు ఉమామహేశ్వరరావు మరియు యువత పాల్గొన్నారు.

మారిక గిరిజన విద్యార్థులకు పుస్తకాలు వితరణ

హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

విశాలాంధ్ర ,వేపాడ : మండలంలోని కరక‌వల స పంచాయతీ శివారు గిరి శిఖర గ్రామమైన మారి క మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చెందిన గిరిజన విద్యార్థులకు శివ చత్రపతి కలామ్ జూనియర్ కాలేజ్ మదురవాడ విశాఖ డైరక్టర్ ఎం.సురేష్ కుమార్ రూ. 11వేల500 రూపాయి లు విలువగల నోట్ బుక్స్, పెన్స్ , పెన్సిల్స్,స్లాం క్స్, ఛార్ట్స్ ను వితరణగా అందిం చారు. కరకవలస పంచాయతీ నుండి గిరిశిఖర మారిక గ్రామానికి సుమారు 12కిలో మీటర్ల మేర దూరం కావడంతో పైగా రహదారి సౌకర్యం లేక పాఠశాల భవనం లేక గిరిజన విద్యార్థులు పడుతున్న అవస్థలపై ప్రత్యేక దృష్టి సారించి పాఠశాలను అభివృద్ధి చేయాలనే సదుద్దేశంతో పాఠశాలకు వసతులు కల్పించాలని అలాగే గిరిజన విద్యార్థులకు చదువుకునేందుకు కావలసిన మౌలిక సౌకర్యాలను వారికి అవసరమయ్యే నోట్ పుస్తకాలు అందిం చాలని,దాతలు సహకారంతో పాఠశాలలను అభివృద్ధి చేయాలని ధ్యేయంగా పలువురు దాతులను కోర గా విశాఖ జిల్లా మదురవాడలో గల శివ ఛత్రపతి కలాం జూనియర్ కళాశాల డైరెక్టర్ ఎం.సురేష్ కుమార్ సహృదయంతో మారిక పాఠశాల ఉపాధ్యా యులు తాడి రాంబాబును కాలేజీకి పిలిపించి విద్యార్థులకు అవసరమగు పుస్తకాలు,పెన్నులు,తదితర వస్తువులను అందించారు. ఈ మేరకు మారిక గిరిజన పాఠశాల విద్యార్థులు,తల్లిదండ్రులు, ఉపాధ్యాయుడు తాడి రాంబాబు తమ పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల విద్యకై అతను చేస్తున్న కృషికి అభినందనలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలి

విశాలాంధ్ర – బొబ్బిలి : మున్సిపాలిటీ ఇంటింటి కుళాయిలు ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరులో పురుగులు ఉంటున్నాయని తాగునీరు తాగితే రోగాలు వచ్చే అవ కాశాలు ఉన్నాయని మున్సి పల్ అధికారులు తాగునీరు ట్యాం కులు లను శుద్ధి చేసి సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గోవులకు గరుకు స్తంభాల ఏర్పాటు

విశాలాంధ్ర శృంగవరపుకోట రూరల్ ఎస్ కోట వాసవి క్లబ్ మెగా మరియు వాసవి క్లబ్ వనిత ఎస్.కోట విభా గం యొక్క సహకారంతో, పశువుల కోసం గరుకు స్తం భాల ఏర్పాటు చేయడం జరిగింది. ఈ స్తంభాలు గోవుల కు వచ్చే దురదను తగ్గించడానికి సహాయపడతాయి. గోవులు ఈ గరుకు స్తంభాలకు రాపిడి చేసుకోవడం ద్వా రా సుఖంగా ఉంటాయి, ఇది గోమాతను సంతోషపెట్టడా నికిలిలి ఒక మార్గంగా పరిగణించబడుతుంది. ఎస్. కోట పట్టణ కేంద్రంలోని బ్రాహ్మణ వీధి గోశాల వద్ద వెంకటరమణ పేట గ్రామంలోని గోశాల వద్ద ఈ స్తంభాలను ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులురీజనల్ చైర్మన్. నానాజీ జోన్ చైర్మన్ . ఎం శివకుమార్ అధ్యక్షులు పి. అప్పారావు వనిత విభాగ అధ్యక్షురాలు కే. కళ్యాణి ఇతర గణ్యులుతోపాటు అనేక మంది సభ్యులు, సామాజిక కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వాసవి క్లబ్ యూత్ ఆధ్వర్యంలో సుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

విశాలాంధ్ర శృంగవరపుకోట రూరల్ వాసవి క్లబ్ యూత్ ఎస్.కోట ఆధ్వర్యంలో శృంగవరపుకోట పట్టణ కేంద్రంలో సుబ్బిరామరెడ్డి కళ్యాణ మండపం ప్రాంగణంలో డయాబెటిక్ టెస్టింగ్ శిబిరాన్ని ఆదివారం ఉదయం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 150 మందికి టెస్టులు నిర్వహించారు ప్రతి ఒక్కరూ కూడా పరిమిత ఆహారాన్ని తీసు కొని షుగర్ వ్యాధి అనే భూతాన్ని తరిమికొట్టి శారీరక మరి యు మానసిక ఉల్లాసంగా ఉండాలని వాసవి క్లబ్ అధ్యక్షులు విజయకుమార్ కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు వేమూరి శ్రీనివాస్ పూర్వ కార్యదర్శులు సతీష్ కుమార్ రవి కిషోర్ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ పూర్వ ప్రాంతీయ అధి,కారి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ బాలనాగు శ్రీనివాస్ కోశాధికారి మహేంద్ర రీజనల్ సెక్రటరీ హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ వ్యూహంతో గంజాయి అక్రమ రవాణను నియంత్రిస్తున్న జిల్లా పోలీసులు

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర విజయనగరం టౌన్ : జిల్లాలో గంజాయి అక్రమ రవా ణ, విక్రయాలు, వినియోగంను నియంత్రించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం చెక్ పోస్టులు ఏర్పాటు, డైనమిక్ వాహన తనిఖీలు చేపట్టడం, అక్రమ రవాణకు బాధ్యులైన ప్రధాననిందితులను గుర్తిం చి, వారిని కేసుల్లో నిందితులుగా చేర్చడం, గంజాయి వ్యాపారాలతో కూడబెట్టిన అక్రమ ఆస్తులను సీజ్ చేయడం, వారిపై హిస్టరీ షీట్లు ప్రారంభించి నిఘా పెట్టడం, గంజాయి వినియోగం వలన కలిగే అనర్ధాలను ప్రజలకు వివరించి, వారిని చైతన్యపర్చడం వంటి బహుముఖ వ్యూహాలను అమలు చేస్తూ, గంజాయిని కట్టడి చేస్తుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – జిల్లాలో గంజాయి అక్రమ రవాణ, విక్ర యాలు, వినియోగంను నియంత్రించేందుకు బహుముఖ వ్యూహా లను అమలు చేసి, సత్ఫలితాలు సాధించామన్నారు. అక్రమ రవాణ ను నియంత్రించేందుకు ప్రధాన మార్గాలను గుర్తించి, ఆయా మార్గా ల్లో నాలుగు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, నిరంతరం వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. అంతేకాకుండా, ప్రతీ రోజూ ఆయా మార్గాల్లో ఆకస్మికంగా 10చోట్ల డైనమిక్ వాహనతనిఖీలు చేపడు తున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణ చేస్తూ పట్టుబడిన నిందితులను అరెస్టుచేయడమే కాకుండా, అందుకు బాధ్యులైన ప్రధాన వ్యక్తులను కూడా నిందితులుగా చేర్చి, వారిని అరెస్టు చేస్తున్నామన్నారు. గంజాయి వ్యాపారాలు సాగించే వ్యక్తులను గుర్తించి, వారిపై హిస్టరీ షీట్లు తెరిచి, వారి కదలికలపై నిఘాపెడు తున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణ, విక్రయాలను ప్రధాన వ్యాపారాలుగు సాగించే వ్యక్తులు కూడబెట్టినఅక్రమ ఆస్తులను గుర్తించి, వాటిని అటాచ్ చేస్తున్నామన్నారు. గంజాయి వినియోగం వలన కలిగే అనర్థాలను విద్యార్థులు, యువత, ప్రజలకు 'సంకల్పం' కార్యక్రమాలతోను, ప్రచార రథంతో విస్తృతంగా ప్రచారం చేస్తూ, ప్రజల్లోచైతన్యం నింపుతున్నామని తెలిపారు. గత సంవత్సరంలో గంజాయి అక్రమ రవాణకు పాల్పడుతున్న వారిపై 88 కేసులు నమోదు చేసి, 2,157 కిలోల గంజాయి, 78 గ్రాముల నల్లమం దును, అక్రమ రవాణకు వినియోగించిన 30వాహనాలను సీజ్ చేయడంతోపాటు, 288మంది నిందితులను అరెస్టు చేసామన్నారు. అదే విధంగా ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 52 కేసులు నమోదు చేసి, 346 కిలోల గంజాయి, అక్రమ రవాణకు వినియోగించిన 21 వాహనాలను సీజ్ చేయడంతోపాటు, 155మంది నిందితులను అరెస్టు చేసి, రిమాండుకు తరలించామని జిల్లా ఎస్పీ తెలిపారు. గం జాయి నేరాలను తీవ్రంగా పరిగణించి, ఆయా కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయడంతోపాటు, కోర్టు విచారణలో ఉన్న కేసుల్లో ప్రాసిక్యూషనుఎప్పటికప్పుడు గమనిస్తూ, సాక్ష్యాధారాలను ప్రవేశ పెడుతూ, నిందితులు శిక్షింపబడే విధంగా చర్యలు చేపడుతు న్నామని తెలిపారు.

ఈనెల 29న ఆనందోబ్రహ్మ ప్రదర్శనలు.

విశాలాంధ్ర – బొబ్బిలి : ఆంధ్రప్రదేశ్ రంగస్థల చరిత్రలో సంచల నం సృష్టిస్తున్న సకల కళల వేదిక ఆనందోబ్రహ్మ 45వ ప్రదర్శన జూన్ 29 ఆదివారం సాయంత్రం శ్రీ కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని ఆనందోబ్రహ్మ అధ్యక్షుడు ఎం విజయ మోహన్ రావు తెలిపారు. స్థానిక కళాభారతి ప్రాంగణంలో ఆనందోబ్రహ్మ సభ్యులతో కలిసి మాట్లాడుతూ 29న జరిగే కళా ప్రదర్శన కార్యక్ర మంలో 45 మంది కళాకారులు రెండు గంటలసేపు పౌరాణిక, సాంఘిక నాటికలు, సినీ , శాస్త్రీయ ,జానపద నృత్యాలు, ఆధ్యాత్మిక కోలాటాలు, మైమ్ షో, సినీ సంగీత విభావరి, ఏకపాత్రాభి నయా లు ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే, ఆనందోబ్రహ్మ సంస్థ గౌరవ అధ్యక్షులు ఆర్ వి ఎస్ కే కె రంగారావు సహకారంతో గత 44 నెలలుగా పౌరాణిక, జానపద, సాంఘిక , చారిత్రక విభాగాల్లో వందలాది కళాకారుల కళా ప్రదర్శన కు అవకాశం కల్పించామని తెలిపారు. సంస్థ సభ్యులు, కళాకారులు జి కరుణ్ కుమార్, టీవీ రమణ, ఎం సి హెచ్ గౌరి నాయుడు, రాముద్రి గోవిందరావు, బి.జీ .గంగాధర్, కె.రామకృష్ణ, జి మల్లేస్వరరావు, వి. రాంబాబు పాల్గొన్నారు.

జిల్లాలో రక్తదాతలకు వేదిక నిర్మించింది మాతృభూమి సేవాసంఘం.భీశెట్టి బాబ్జి

విశాలాంధ్ర – విజయనగరం రూరల్ : విజయనగరం జిల్లాలో యువతకు రక్తదానం పై చైతన్య కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూనే రక్తదాతలకు ఒక వేదికను తయారు చెయ్యడంలో మాతృభూమి సేవాసంఘం కీలకపాత్ర పోసించిందని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. మాతృభూమి సేవాసంఘం వ్యవస్థాపకుడు ఇప్పలవలస గోపాలరావు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం గుర జాడ గ్రంథాలయం లోని చాసో భవనంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని అయన జ్యోతి వెలిగించి ప్రారంభించిన అనం తరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో తలసీమియా, హెచ్. ఐ.వి.బాధితులకు,రోడ్డు ప్రమాదంలో ఉన్నవారికి,అత్యవసర ఆపరే షన్‌లకు ఇప్పలవలస గోపాలారావు వెంటనే స్పందించి రక్తం అం దేటట్లు ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు,అబ్దుల్ కలామ్ స్వచ్ఛంద సంస్థ జాతీయ అధ్యక్షుడు మమ్ముల తిరుపతి రావు మాట్లాడుతూ స్వ చ్ఛంద సంస్థలు ప్రజలకు అండగా ఉండాలని గోపాలరావు పుట్టిన రోజు సందర్భంగా సుమారు 70 మంది స్వచ్ఛందంగా రక్తదానం చె య్యడం గొప్ప విషయమని అభినందించారు,ఈ సమావేశంలో ఎన్.

వి.ఎస్. బ్లడ్ బ్యాంక్ అధినేత తాడేపల్లి నాగేశ్వరరావు, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శర్మ,విశ్రాంత చీఫ్ బ్యాంకింగ్ అధికారి పిడకల ప్రభాకరరావు, కనకాచారి, ఈశ్వర ప్రసాద్,పైడి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేల గొంతులు ఒక్కటై నిరసన తెలపాలి

జిల్లా వైసీపీ ప్రచార అధ్యక్షులు వలి రెడ్డి

విశాలాంధ్ర,చీపురుపల్లి : నిరుద్యోగులు యువత విద్యార్థులు ఏకమై వేలాది గొంతులతో నిరసన గలాన్ని కూటమిప్రభుత్వానికి తెలపాలని జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార అధ్యక్షులు వలి రెడ్డి శ్రీనివాస నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం చీపురుపల్లి లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ఆర్ కాం గ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ఈ నెల 23న విజయన గరం జిల్లా కలెక్టరేట్ ఎదుట జరుపుకున్న నిరసన కార్యక్రమానికి వేలాది సంఖ్యలో విద్యార్థులు నిరుద్యోగులు తరలిరావాలని ఆయన కోరారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా పక్షాన పోరాటం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివా సరావు, ఆదేశాల మేరకు చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఇంటికో ఉద్యోగం నిరుద్యోగ భృతి ఫీజు రియంబర్స్మెంట్ పేర్లతో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా తుంగలో తొక్కిందన్నారు. యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై పోరుబాట పేరుతో యువత పోరాటం చేయుటకు సిద్ధం కావాలన్నారు. నిరసన కార్యక్రమం అనంతరం జిల్లాలోని పలు నియోజకవర్గాల నుండి మండలాల నుండి తరలివచ్చిన వైయస్సార్ పార్టీ అభిమానులు కార్యకర్తల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు.

సైనిక ఉద్యోగి సుధాకర్ ను సత్కరించిన వాసవి క్లబ్ శ్రేణులు

విశాలాంధ్ర శృంగవరపుకోట రూరల్: దేశ రక్షణకు తమ జీవితాలను అంకితం చేసిన సైని కోద్యోగులను సన్మానించే ఉద్దేశ్యంతో, వాసవి క్లబ్ మరియు వనిత యూత్ సంస్థలు ఉదయ స్థ మాన సేవల కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా, శివరామరాజుపేట గ్రా మానికి చెందిన భూతపూర్వ ఆర్మీ జవాన్ పినిశెట్టి సుధాకర్‌ను గౌరవపూర్వకంగా సత్కరిం చారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ప్రతినిధులు మా ట్లాడుతూ, దేశ సురక్షితత్వానికి తమ ప్రాణాల ను పణంగా పెట్టే త్రివిధ సైన్య దళాల వీరులే నిజమైన హీరోలు. వారి త్యాగాలకు, సేవలకు మనమందరం కృతజ్ఞతలు తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉంది' అని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వనిత ,యూత్ సభ్యులు, యువతరం సైనిక దళా లలో చేరి దేశసేవ చేయాలనే ఆశయాన్ని ప్రోత్సహించారు. సైనికుల త్యాగాలను గుర్తుచేసుకోవడం మన ప్రతిఒక్కరి కర్తవ్యం. వారి కుటుంబాలకు మద్దతు ఇవ్వడం ద్వారా మనం మన కృతజ్ఞతను చూపించగలం అని యువజన నాయకులు తెలియజేశారు. నా సేవకు ఇలా గౌరవించడం నాకు, నా కుటుంబానికి గొప్ప సం తోషం నింపింది అని మనోభావాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, యువ జ నులు, స్థానిక ప్రజలు పాల్గొని, సుధాకర్కు అభినందనలు తెలిపారు. దేశభక్తి, సైనికుల పట్ల గౌరవా భిమానాలతో కూడిన ఈ కార్యక్రమం అందరికీ స్ఫూర్తిదాయకంగా ముగిసింది.

వైభవంగా ప్రపంచ సంగీత దినోత్సవం

విశాలాంధ్ర విజయనగరం ఫోర్ట్: (ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్(విజయనగరం)మరియు రోటరీ దశిగి పేరాజు మ్యూజిక్ అకాడమీ సంయుక్త నిర్వహణలో కొత్త అగ్రహారం రోటరీ కమ్యూనిటీ హాల్ లో శనివారం రాత్రి ప్రపంచ సంగీత దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు, ద్వా రం నరసింగరావు స్కూల్ అధ్యక్షులు ఉసిరికల చంద్రశేఖర్ రావు తదితరులచే జ్యోతి ప్రకాశంతో ఉత్సవం ప్రారంభం అయ్యింది. అకాడమీ అధ్యాపకులు డాక్టర్ కె.ఎ.పద్మప్రియ, మంగతాయారు వీణలపై, మోదేకుర్తివెంకట కామేశ్వర రావు వేణువుపై, పద్మావతి శారద, మహేశ్వర రావులు గాత్రంపై, భానుహర్ష వయొలిన్ పై, శ్యామ్ గిటార్ పై, డాక్టర్ డి వి శ్రీకాంత్ కీ బోర్డు పై, డాక్టర్ మండపాక రవి మృదంగం తో సంగీత కార్యక్రమం జరిగింది. నాట రాగంలో దీక్షితార్ కృతి మహాగణపతిం, త్యాగరాజ కృతి రామ నన్ను బ్రోవరా, శోభిల్లు సప్తస్వర, హిందోళ రాగంలో సామజ వరగమన ప్రధానాంశంగా జరిగింది. దీనిలో లయపరంగా డాక్టర్ మండపాక రవి తన్యావర్తనం విశేషంగా ఆకట్టుకుంది. తర్వాత అన్నమాచార్య కీర్తన రాగామాలిక ఎంతమాత్రమున తోపాటు వివిధ వాగ్గేయకారుల కీర్తనలు గానం చేసి సంగీత నీరాజనం గా సభ రక్తి కట్టించారు. చివరగా శ్యామ్ గారు, శ్రీకాంత్ గిటార్, కీబోర్డ్ పై కొన్ని పాశ్చాత్య సంగీతాన్ని, దేశభక్తి గీతాల్ని ఆలపించారు. విజయనగరానికి చెందిన ప్రఖ్యాత సంగీత దర్శకులు ఎం .భీష్మారావుకి రెండు సంస్థలు సంయుక్తంగా ముఖ్య అతిథి ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఇ.ఆర్ సోమయాజులు చేతుల మీదుగా సన్మానించారు .కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ

కార్యక్రమంలో రెండు సంస్థల సభ్యులు ఉసిరికల చంద్రశేఖర్ రావు, డాక్టర్ ఎ.గోపాల్ రావు, డి. బాలాజీ , రోటేరియన్లు, సంగీతా భిమా నులు, కార్యవర్గ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.